పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

పెద్దపల్లి, మే 24: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా సాగుతున్నాయని జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. జిల్లాలో ఈ సీజన్ లో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 2,75,826 మెట్రిక్ టన్నులకు పైగా వడ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 38,720 మంది రైతుల నుంచి 605.20 కోట్లకు పైగా విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. 35,653 మంది రైతులకు రూ. 499.58 కోట్లకు పైగా ధాన్యం డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ధాన్యం అమ్మిన మూడు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు.

వైభవంగా నృసింహ స్వామి జాతర

రథం వద్ద భక్తుల రద్దీ

ధర్మారం, మే24: ఖిలావనపర్తిలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతర వైభవంగా జరిగింది. ఈనెల17న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి ఉత్సవ విగ్రహం పెట్టి పూజలు చేశారు. అనంతరం భక్తులు రథం లాగారు. దాదాపు 30 వేలకు పైగా భక్తులు తరలి వచ్చారు. ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామి, పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, మాజీ మంత్రి,పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ –బల రాంరెడ్డి దంపతులు వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో కాంతారెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ టీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఓదెల, మే 24: మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు గ్రామంలో ఎల్లమ్మ ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు గౌడ సంఘం అధ్యక్షుడు పచ్చిమట్ల శ్రీనివాస్ తెలిపారు. మొదటి రోజు గ్రామంలో జోగు కోసం ఇల్లిల్లూ తిరిగారు. డప్పుచప్పుళ్లు, నృత్యాలతో గ్రామంలో భక్తుల కోలాహాలంతో సందడిగా మారింది.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

యైటింక్లయిన్‌కాలనీ, మే 24 : హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని హనుమాన్ ఆలయంలో శనివారం నుంచి జూన్ 1 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు సౌమిత్రి సుమంతాచార్యులు తెలిపారు. స్థానిక ప్రెస్ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. జూన్ 1న హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా వారం పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హనుమాన్ భక్తులు మల్లికార్జున్, కండె సాగర్, రమేశ్, మణి, రొంటాల సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

'రామగుండం'లో డీజిల్ గోల్‌మాల్?

- బిల్లుల రికార్డులో తప్పులు దొర్లుతున్నట్లు ఆరోపణలు..
- రెండు రోజుల కిందట ప్రశ్నించిన వాహన డ్రైవర్లు
- ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే జరుగుతుందని ప్రచారం

బల్దియా కార్యాలయంలో పారిశుధ్య వాహనాలు

కోల్‌సిటీ, మే 24: రామగుండం నగర పాలక సంస్థలో మరో అవినీతి ఆరోపణ దుమారం రేపుతున్నది. కొద్ది రోజులుగా పారిశుధ్య వాహనాల డీజిల్ పేరిట గోల్‌మాల్ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఆ విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఉద్యోగి చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలు చర్చకు తెరలేపింది. కార్పొరేషన్‌లో చెత్త సేకరణకు వినియోగించే ట్రాలీలకు వారానికి 30 లీటర్లు డీజిల్ నింపాల్సి ఉండగా 24 లీటర్లు మాత్రమే పోసి రికార్డుల్లో మాత్రం 30 లీటర్లుగా చూపిస్తూ ఈ లెక్కన నెలకు దాదాపు రూ.5 లక్షల వరకు మాయమవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే విషయమై వాహనాల డ్రైవర్లు కూడా రెండు రోజుల కిందట డీజిల్ సెక్షన్ ఇన్‌ఛార్జితో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. ఈ వ్యవహారమంతా ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే జరుగుతుండగా రామగుండం బల్దియా బదల్ గయా... అన్నట్టు ప్రస్తుతం కార్యాలయంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు మారింది.

పారిశుధ్య విభాగంలో అవినీతి చెదలు...

రామగుండం నగర పాలక సంస్థలోని ప్రధానమైన పారిశుధ్య విభాగానికి అవినీతి చెదలు పట్టుకున్నట్లు తెలుస్తున్నది. గతంలోనే ఈ విభాగాన్ని ప్రక్షాళన చేసి నప్పటికీ చాలా రోజుల తర్వాత మళ్లీ అవినీతి మరక అంటుకుందనే ప్రచారం జరుగుతున్నది. కొద్ది నెలలుగా రామగుండం కార్పొరేషన్‌లో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పుడు తిరగని వాహనాలు తిరిగినట్టు, తిరిగిన వాహనాలకు ఇంధనం పోసినట్టు తప్పుడు బిల్లులు తయారు చేసి పెద్ద స్కాంకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రామగుండం కార్పొరేషన్‌లో పారిశుధ్య విభాగంలో ప్రస్తుతం 50 చెత్త సేకరణ ట్రాలీలు, మరో 20 దాకా ట్రాక్టర్లు, కంపాక్టర్లు, జేసీబీలు, ఇతరత్రా మొత్తం 90 వరకు వాహనాలు ఉంటాయి. వీటిలో దాదాపు 70 వాహనాలు మాత్రమే నిత్యం ఫీల్డు మీదకు వెళ్తుంటాయి. ఐతే చెత్త సేకరణకు వినియోగించే ఆటోట్రాలీల్లో వారానికి 24 లీటర్ల డీజిల్ పోస్తూ రికార్డుల్లో 30 లీటర్లు పోసినట్లుగా బిల్లులు తయారు చేసి కాజేస్తున్నట్లు తెలిసింది. దాదాపు 50 ఆటో ట్రాలీలకు ఒక్కో ట్రాలీ నుంచి 6 లీటర్ల చొప్పున తీసుకున్న వారానికి 300 లీటర్ల డీజిల్‌కు సంబంధించిన బిల్లుల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తున్నది. డీజిల్ సెక్షన్ బాధ్యతలు చూసుకునే సదరు ఉద్యోగి ఈ అవకతవకలకు పాల్పడుతున్నట్లు కార్పొరేటర్లే ఆరోపణలు చేస్తున్నారు. ఎన్టీపీసీ ఖాజీపల్లిలోని పెట్రోలు బంకులో ప్రతి రోజూ ఉదయం 4 గంటలకు ఈ వాహనాల్లో డీజిల్ నింపుతుంటారు. సందిట్లో సడేమియాగా కొంతమంది ప్రజాప్రతినిధుల వాహనాల్లో కూడా డీజిల్ పోస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు రోజుల కిందట ఆటో ట్రాలీల డ్రైవర్లు తమ వాహనాల్లో కేవలం 24 లీటర్లు మాత్రమే పోసి రికార్డుల్లో ఎక్కువగా పోస్తున్నట్లు తెలిసి వాగ్వాదానికి దిగినట్లు కూడా తెలిసింది. తిరగని వాహనాలు కూడా తిరిగినట్లు డీజిల్ లెక్కలు చూపి పెద్ద మొత్తంలో గోల్‌మాల్ చేస్తున్నట్లు కార్పొరేటర్లే బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై ఆ సెక్షన్ ఇన్‌చార్జి కిరణ్‌ను వివరణ కోరగా, వాహనాల డీజిల్ వ్యయం తగ్గించేందుకే ప్రయత్నం చేస్తున్నానని, గతంలో వారానికి రూ.19లక్షల వరకు బిల్లులు ఉండేవని, ఇప్పుడు వాటిని రూ.15లక్షల వరకు తీసుకవచ్చానని, గిట్టని కొంతమంది రాజకీయ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఆరోపణల మాట వాస్తవమే..

కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలో వాహనాలకు సంబంధించి డీజిల్ లెక్కల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న మాట వాస్తవమే. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని కారణంగా కావాలనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. గతంలో వాహనాల డీజిల్ బిల్లులు తడిసి మోపెడు అయ్యేవి. ఇప్పుడు చాలా వరకు తగ్గించాం. డీజిల్ బిల్లులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. రెండు రోజులుగా వస్తున్న ఆరోపణలను పరిగణలోకి తీసుకొని ఏమైనా తప్పిదాలు జరిగితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

సీహెచ్ శ్రీకాంత్, కమిషనర్

అవినీతి అధికారికి తాళాలు

- 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు

రామగుండం కార్పొరేషన్‌లో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేసి గతంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఉద్యోగికి తిరిగి మరో కీలక శాఖ అప్పగించడంతో కార్పొరేషన్ మరింత అపనిందల పాలయ్యే ప్రమాదం ఉందని 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు ఆరోపించారు. చిన్న చిన్న సర్టిఫికెట్లు ఇచ్చే విషయంలోనే గతంలో అనేక అక్రమాలకు పాల్పడిన సదరు ఉద్యోగికి కొందరు నేతల అండదండలతో శానిటేషన్ విభాగం అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొన్నారు. సదరు అధికారి చెత్తను సేకరించే ప్రధాన వాహనాలకు డీజిల్, పెట్రోలు కొట్టించే విషయంలో పెద్ద మొత్తంలో అవకతవకలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. రోజుకో ప్రాంతంలో మూడు ట్రిప్పులు కొట్టే చెత్త సేకరణ వాహనాలను ఏకంగా ఒకటే ట్రిప్ నడిపిస్తూ మిగిలిన డీజిల్, పెట్రోలును పక్కదారి పట్టిస్తున్నాడని ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధి అండదండలతోనే ఇక్కడి అధికారులు పట్టించుకోవడం లేదని, కలెక్టర్ జోక్యం చేసుకొని ఈ విభాగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని కోరారు.

ఈజీఎస్ కూలీలకు అవగాహన

జూలపల్లి, మే 24 : జూలపల్లిలో ఈజీఎస్ కూలీలకు మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఉదయం పూట పనులు చేయాలన్నారు. ఎండ తీవ్రతను తట్టుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సీహెచ్‌వో కలీముద్దీన్, ఏపీవో సదానందం, ఫీల్డ్ అసిస్టెంట్ పాటకుల నర్సయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై వినతి

సీహెచ్‌పీ అధికారికి వినతి పత్ర అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ, మే 24 : సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలపై ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 సీహెచ్‌పీ ఇన్‌చార్జి సదానందంకు రిటైర్డ్ ఉద్యోగులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగుల రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలు ఇవ్వాలని కోరారు. వీటి కోసం ఆరు నెలల క్రితమే దరఖాస్తు చేసుకున్నా స్పందించకపోవడం సరికాదన్నారు. యాజమాన్యం స్పందించి వెంటనే కాపీలు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో కుమారస్వామి, కలువల జగన్నాథం ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

జూలపల్లి, మే 24 : జూలపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఫస్టియర్‌లో 63మంది , సెకండియర్‌లో 23 మంది విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరిండెంట్ సుధాకర్, డీవో రాజేందర్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లి , మే 24: స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాని వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన సీఎం సమస్యల పరిష్కారానికి రెవిన్యూ చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేశారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ టీ శేఖర్ 33 జిల్లాల కలెక్టర్లకు జారీ చేసిన ఆదేశాల కాపీ ప్రతులను మీడియాకు విడుదల చేశారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యే విజయరమణారావుకు ధన్యవాదాలు తెలిపారు.

మానవత్వం చాటుకున్న జడ్పీటీసీ

ఫర్టిలైజర్‌సిటీ, మే 24: ఎన్టీపీసీ మెటీరియల్ గేట్ మూలమలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తాత మనవడిని పాలకుర్తి జడ్పీటీసీ కందుల సంధ్యారాణి తన వాహనంలో సింగరేణి దవఖానకు తరలించి మానవత్వం చాటుకున్నారు. గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు ఆరెల్లి శ్రీనివాస్ తన కూతురు, ఇద్దరు చిన్నపిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఎన్టీపీసీ వద్ద జరిగిన ప్రమాదంలో ఆరెల్లి శ్రీనివాస్ అతని మనవడు తలకు తీవ్ర గాయాలై రోడ్డుపై పడి ఉన్నారు. అటువైపు నుంచి వస్తున్న జడ్పీటీసీ తన వాహనంలో ఇద్దరిని ఎక్కించుకొని సింగరేణి దవాఖానకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగై వైద్యం కోసం వారిని వైద్యులు హైదరాబాద్ దవాఖానకు తరలించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న ఎంపీపీ రాచకొండ లక్ష్మి

కమాన్‌పూర్, మే 24: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ రాచకొండ లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యుత్, వైద్య, ఆరోగ్య, మిషన్ భగీరథ, విద్య, సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమం, పశు పోషణ, ఆర్టీసీ, పౌర సరఫరాలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, సెర్ప్ కార్యక్రమాలు, గ్రామీణ అభివృద్ధి శాఖలపై సమీక్షించారు. పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సంబంధించిత అంశాలపై చర్చ జరగలేదు. సభ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలు పరిష్కరించాలని సభ్యులు డిమాండ్ చేశారు. చెరువులో మట్టి తవ్వకాలు, ఇటుక బట్టీలకు తరలింపు వ్యవహారంపై వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్ ప్రస్తావించారు. ఈ విషయమై తహసీల్దార్ ఆరిఫొద్దీన్ స్పందిచారు. మట్టి తవ్వకాలకు సంబంధించి ఇరిగేషన్ శాఖ నుంచి ఓ బ్రిక్స్ కంపెనీ అనుమతి తీసుకుందని తెలిపారు. మట్టి తరలింపును నియంత్రించేందుకు రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపడుతున్నారని వెల్లడించారు. రైతుల పొలాల్లో చెరువుల్లోని మట్టిని పోసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు కోరారు. సమావేశం లో ఇన్‌చార్జి ఎంపీడీవో శేషయ్య, సూరి, ఎంపీటీసీలు కోలేటి చంద్రశేఖర్, శంకర య్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

సమస్యలను విన్నవిస్తున్న వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్

ప్రశాంతంగా 'పాలిసెట్'

- ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థినిని అనుమతించని అధికారులు

మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్, మే 24: పెద్దపల్లిలో పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. పాలిసెట్ కోసం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు 2330 మంది విద్యార్థులకు గాను 2116 మంది హాజరయ్యారు. 214 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను పెద్దపల్లి జిల్లా కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్యతో పాటు పలువురు అబ్జర్వర్లు సందర్శించారు. పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రానికి మంథనికి చెందిన మిట్ట అశ్విత ఐదు నిమిషాలు ఆలస్యంగా రావడంతో అప్పటికే సమయం అయిపోయిందని అధికారులు గేట్లు మూసివేశారు. ఎంత బతిమాలినా అధికారులు అనుమతించకపోవడంతో చేసేదేమి లేక రోదిస్తూ ఇంటిదారి పట్టింది.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

ముత్తారం : మాట్లాడుతున్న ఏవో

కమాన్‌పూర్ : మాట్లాడుతున్న ఏవో

కమాన్‌పూర్, మే 24: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఎస్ఐ చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌కుమార్ సూచించారు. విత్తనాల చట్టంపై వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా ఎరువులు–విత్తనాలు విక్రయ దుకాణాల నిర్వాహకులకు కమాన్‌పూర్ ఠాణాలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో, ఎస్ఐ మాట్లాడారు. రాబోయే వానకాలంలో నకిలీ విత్తనాల నియంత్రణ, క్రయవిక్రయాలపై పాటించాల్సిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు తయారు చేసిన విత్తనాలు నోటిఫైడ్ పేరుతో మార్కెట్‌లోకి వస్తాయని ఇవి నాణ్యత, పంపిణీ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే ఉత్పత్తిదారులు, పంపిణీ దారులపై ఫిర్యాదు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.

విత్తన కొనుగోళ్లపై అవగాహన

జూలపల్లి, మే 24 : కుమ్మరికుంట, వడ్కాపూర్, చీమలపేటలో విత్తన కొనుగోళ్లపై రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో ప్రత్యూష మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి పొందిన షాపుల్లోనే విత్తనాలు కొనుగోళ్లు చేయాలని సూచించారు. బస్తాలు, రశీదులపై ముద్రలు, తేదీలు, తేమ శాతం, ప్రామాణికలు పరిశీలించాలని పేర్కొన్నారు. పంటలు చేతికి వచ్చే చివరి దశ దాకా రశీదులు భద్రపర్చుకోవాలని సూచించారు. డీలర్లు రైతుల వివరాల నమోదు చేసుకోవాలని, ధరల పట్టికలు, నిల్వలు కచ్చితంగా రికార్డు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, మందులు, ఎరువులు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, కుంట రాజేశ్వర్‌రెడ్డి, ఏఈవోలు కిరణ్మయి, రాఖేశ్, శ్రీవాణి పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

ముత్తారం, మే 24: వానకాలం పంటల సాగులో విత్తనాలు కొనుగోలు చేసే సమయలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో చిందం శ్రీకాంత్ సూచించారు. మండలంలోని శుక్రవారంపేటలో రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. రశీదులో విత్తన కంపెనీ పేరు, రకం, బ్యాచ్ నంబరు, లాట్ నంబరు, రేటు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో హారిక, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు లాభదాయకం

కాల్వశ్రీరాంపూర్, మే 24: వ్యవసాయ భూమిలో నవధాన్యా సాగుతో జీవ వైవిధ్యం పెరిగి భూమికి ఎంతో మేలు చేకూరుతుందని డబ్ల్యూడబ్లూఎఫ్ కేశవాపూర్ రైతు ఉత్పత్తిదారుల క్షేత్రపరిశీలకుడు ఈ మహేందర్ అన్నారు. ఇద్లాపూర్‌లో నవధాన్యాల సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని పలువురు రైతుల వ్యవసాయ భూముల్లో నవధాన్యాలు చల్లించారు. 20రోజుల తరువాత నేల దుక్కి దున్నడంతో నత్రజని స్థిరీకరించి, భూసారం పెరుగుతుందని రైతులకు వివరించారు. ఇక్కడ పీయూ మేనేజర్ సాయిప్రకాశ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట వినియోగించుకోవాలి

ఓదెల, మే 24: పంటల పాటుకు సేంద్రియ ఎరువుగా పచ్చిరొట్ట ఎరువులు వాడాలని ఏవో నాగార్జున కోరారు. శుక్రవారం నాంసానిపల్లిలో ఉపాధి హామీ పనుల వద్ద రైతులతో సమావేశమయ్యారు. పచ్చిరొట్ట ఎరువులతో కలిగే లాభాలను వివరించారు. ఆయన వెంట ఏఈవో సంధ్య ఉన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

జూలపల్లి, మే 24 : కాచాపూర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మారం మండలం ఖిలావనపర్తికి చెందిన తాళ్లపెల్లి స్వామి (25) బంధువుల ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో కల్వర్టుపై కూర్చున్న స్వామిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో స్వామి కాలు విరిగిపోగా, చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని, గుర్తు తెలియని వాహనం ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

మంథని, మే 24: మంథని ఎక్సైజ్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జంగ సతీశ్ గుండె పోటుతో చనిపోయాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి సతీశ్‌కు వాంతులు కావడంతో దవాఖానకు తరలించే లోపే గుండె పోటుతో మృతి చెందాడు. కాగా సతీశ్ స్వస్థలం పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట. సతీష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించిన డీపీవో

ధర్మారం,మే24: కొత్తపల్లి (న్యూ) గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత శుక్రవారం సందర్శించారు. పల్లె ప్రగతి ద్వారా కల్పించిన మౌలిక సదుపాయాల గురించి ఆమె తెలుసుకున్నారు. అనంతరం గ్రామ శివారులోని నర్సరీ , సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనం, గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. వాటి వినియోగంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని, పచ్చదనం పెంపునకు కృషి చేయాలని సూచించారు. ఇక్కడ జీపీ కార్యదర్శి సంపత్ ఉన్నారు.

శాంతి స్థాపనకు బౌద్ధం ఏకైక మార్గం

బుద్ధుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కోల్‌సిటీ, మే 24: ప్రపంచంలో శాంతి నెలకొల్పడానికి బౌద్ధం ఏకైక మార్గమని పలువురు అభిప్రాయపడ్డారు. బుద్ధ జయంతి సందర్భంగా స్నేహ సాహితీ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన జయంతి ఉత్సవంలో ప్రముఖ కవి, రచయిత ఏలేశ్వరం వెంకటేశ్, యాదవ రాజ్, పోచయ్య మాట్లాడారు. బౌద్ధం ఆచరించడం ద్వారా శాంతి సౌఖ్యాలు పరిఢవిల్లుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్, డాక్టర్ శంకర్ లింగం, డాక్టర్ నారాయణ, రమేశ్, వెంకటేశ్, పోగుల శేఖర్, పుట్ట నారాయణ పాల్గొన్నారు.

థియేటర్‌లో సంబురాలు

కేక్ కట్ చేస్తున్న నాయకులు, అభిమానులు

గోదావరిఖని/కోల్‌సిటీ, మే 24: గోదావరిఖనికి చెందిన నామని ప్రశాంత్ నటించిన రాజు యాదవ్ సినిమా శుక్రవారం రాజేశ్ థియేటర్‌లో విడదలైంది. మిత్ర బృందం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం మిత్రులతో కలిసి సినిమాను వీక్షించారు. ప్రశాంత్ నటించిన సినిమాను ఆదరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మానిక రాజు, సాయికుమార్, స్వచ్ఛంద సంఘాల సలహాదారు దయానంద్ గాంధీ, నామని శ్రీనివాస్, బాదం వసంత, సుధీర్ తదితరులున్నారు.

వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలి

రామగిరి, మే 24: సెంటినరీకాలనీ రాణీ రుద్రమదేవి స్టేడియంలోని వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ కోరారు. ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వాకింగ్ ట్రాక్ గుంతలమయంగా మారి, నడవడానికి ఇబ్బందిగా ఉందన్నారు. వాకింగ్ ట్రాక్‌ను మరమ్మతు చేపట్టాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

సంపాదించుకోవచ్చు

★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం॥ చేతివ్రాత ద్వారా నెలకు 10 వే॥ల నుండి 15 వే॥ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.
NTK-311319

CHANGE OF NAME

★మోతె చందు, తండ్రి సమ్మయ్య, గ్రామము కొత్తపల్లి అను నేను నా పేరును మోతె చంద్రశేఖర్‌గా తేది. 24-05-2024 రోజున మార్చుకొనుచున్నాను. ఇక మీదట మోతె చంద్రశేఖర్ గా కొనసాగించబడును.
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూ